ప్రజాశక్తి
సోమవారం 21 అక్టోబర్ 2024





16.3 అడుగులకు చేరిన

'రాళ్లపాడు' నీటిమట్టం

ప్రజాశక్తి - లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 16.3 అడు గులకు చేరింది.శనివారం రాత్రి ప్రాజెక్టు ఎక్కువ ప్రాంతంలో భారీ వర్షాలు పడడంతో ప్రాజెక్టులోనికి నీరు వచ్చి చేరుతుంది..మరోవైపు సోమశిల ఉత్తర కాలము నుంచి ప్రాజెక్టులను రావడంతో నీటిమట్టం క్రమేపి పెరుగుతుంది.తుఫాన్ ప్రభావం ఇంకా ఉండడంతో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు చెప్పారు.



రాళ్లపాడుల ప్రాజెక్టు

ప్రజా ఉద్యమాల్లో

సిపిఎం ముందడుగు..!

25వ నగర మహాసభలు ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రజా ఉద్యమాల్లో సిపిఎం ముందడుగు వేస్తుందని, ఆ దిశగా రానున్న రోజుల్లోనూ కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఎం నేతలు పిలుపునిచ్చారు. స్థానిక 15వ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్ ప్రాంతంలో విజిబి కళ్యాణ మండపంలో సిపిఎం 25వ నగర మహాసభలు ప్రారంభ మయ్యాయి. రెండు రోజులు జరగనున్న ఈ మహాసభలు ఆదివారం మొదటి రోజు నారు క్రిష్ణయ్య నగర్, పులి బలరామయ్య ప్రాంగణంలో సిపిఎం జెండాను ఆ పార్టీ సీనియర్ నాయకులు పి. చంద్రారెడ్డి ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. నారు క్రిష్ణయ్య , పులి బలరామయ్య చిత్రపటాలకు సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడారు. గత మహాసభ నుంచి నేటి వరకు జరిగిన పరిణామాలను, నిర్వహించిన కార్యక్రమాలను, ప్రజా ఉద్యమాలు, పోరాటాలు,పార్టీ నిర్మాణ పరిస్థితిపై సమీక్షించుకుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఉద్యమాలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణను ఈ మహాసభల్లో రూపొందిం చుకుంటామన్నారు. జిల్లా మహాసభలు ఇందుకూరుపేట మండలంలో డిసెంబరు 7,8 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. సిపిఎం రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరంలో ప్రధానంగా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందన్నారు. దీనిని సరిచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల న్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి మద్యం విక్రయాలను విచ్చలవిడి చేసిందన్నారు. ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్తు ఛార్జీలను పెంచేందుకు నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. జమిలీ ఎన్నికల పేరుతో రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలకు తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా పనిచేస్తుం దన్నారు. ఇటువంటి సమస్యలన్నింటిపై చర్చిస్తా మన్నారు. ప్రజా ఉద్యమాలకు కార్యాచరణ రూపొం దిస్తామ న్నారు. అనంతరం గత మహాసభ నుంచి నేటి వరకు ప్రజా ఉద్యమాలలో మరణించిన నాయకుల, కార్యకర్తలకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్

పేదలకు అండగా ఉద్యమాలు

అనంతరం నగర నియోజకవర్గంలో గడిచిన 3 ఏళ్లలో చేసిన ప్రజా ఉద్యమాలపై కార్యదర్శి నివేదికను సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మహాసభలో ప్రవేశపెట్టారు. గడచిన మూడేళ్లలో అనేక ప్రజా ఉద్యమాల ద్వారా పేదలకు అండగా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న తీర్మానాలు చేశారు. కాలువ కట్టలపై



జెండా ఆవిష్కరణ చేస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు చంద్రారెడ్డి

నివాసం ఉన్న పేదలకు అండగా నిలబడాలని, పొదుపు మహిళల సమస్యలు పరిష్కరించి మహిళలకు ఉపాధి పెంచాలని, కష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ వెంటనే పనిలోకి తీసుకురావాలని,నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, మద్యాన్ని నిషేధించాలని మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు వేధింపులను అరికట్టాలని తీర్మానాలు మహాసభలలో ఏకగ్రీవంగా ఆమోదించారు. సిటీ నియోజకవర్గ పరిధిలోని 28 వార్డుల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్మికుల పని ప్రదేశాలలో అనేక సమస్యలతో సతమతమవుతున్నారని వారందరినీ సంఘటితం చేసి భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు చేపడతామన్నారు. మహాసభలకు అధ్యక్ష వర్గంగా సిపిఎం సీనియర్ నాయకులు పి చంద్రారెడ్డి,షేక్ మస్తాన్ బి, అత్తిమూరు శ్రీనివాసులు వ్యవహరిం చారు. ఈ మహాసభలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి సూర్యనారాయణ, నగర నాయకులు బీపీ నరసింహ, ఆర్ శ్రీనివాసులు,కే పద్మ,సుబ్బమ్మ రమణారెడ్డి,శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాలుగు తీర్మానాలకు ఆమోదం

మహాసభ మొదటి రోజు కార్యక్రమంలో మధ్యాహ్న భోజన విరామం అనంతరం డివిజన్ వారీ నివేదికలపై గ్రూప్ చర్చలు నిర్వహించారు. నగరంలో కాలువ కట్టలపై నిరుపేదలు నిర్మించుకున్న నివాసాలను తొలగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దారుణమని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగేశ్వరరావు తీర్మానం ప్రవేశపెట్టారు. నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపాలని, నిరుద్యోగ భృతి కల్పించాలని,కష్ణపటం పోర్టు కంటైనర్ టెర్మినల్ వెంటనే పునరుద్ధరించాలి డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బి.పి నరసింహ తీర్మానం ప్రవేశపెట్టారు. పొదుపు గ్రూపు మహిళల సమస్యలను పరిష్కరించాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని తీర్మానం ప్రవేశ పెట్టారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణ వెంటనే నిలిపివేయాలని, మైనారి టీలపై బిజెపి ప్రభుత్వ దాడులు నిలిపివేయాలని తీర్మానం ప్రవేశపెట్టారు. నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాలకు మహాసభలకు హాజరైన ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.



నారు కృష్ణయ్య, పులి బలరామయ్య చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

నేటి నుంచి పోలీస్ అమరవీరుల వారోత్సవాలు : ఎస్‌పి

ప్రజాశక్తి-నెల్లూరు

విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసుల్ని గుర్తు చేసుకోవడంతో పాటు సమాజంలో కీలకమైన పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలు గురించి ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి ఈ నెల 31వ తేది వరకు పోలీసు అమర వీరుల వారోత్సవాలు నగరంలో నిర్వహిస్తున్నట్లు ఎస్పి జి.కృష్ణకాంత్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పోలీసు అమర వీరుల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. అక్టోబర్ 21 న పోలీసు అమరవీరుల స్మృతి దినం-2024 సందర్భంగా ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ వద్ద అమరవీరులకు ఘన నివాళులు అర్పించిన అనంతరం ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 22 నుండి 31 వరకు పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 22 నుండి 31 వ తేదీ వరకు సమాజ భద్రత కోసం అసాంఘిక శక్తుల అణిచివేత పోలీసుల త్యాగం, పరాక్రమాలు కనపరిచే పోలీసు ధైర్యసాహసాల చిత్రాలను జిల్లా వ్యాప్తంగా సినిమా హాళ్లలో స్థానిక కేబుల్ టి.వి లలో ప్రదర్శింపనున్నట్లు తెలిపారు. ఈనెల 26 మరియు 27 న ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఈనెల 26 నుండి 27 వ తేదీ వరకు జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ తో పాటు సబ్ డివిజన్ కార్యాలయాలు, పోలీసు స్టేషన్ ల స్థాయిలో ఓపెన్ హౌస్ లు నిర్వహించనున్నారు. పోలీసులు నిత్యం వినియోగించే సాధనాలు, పరికరాలను ప్రదర్శించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన చేయనున్నారు. పోలీసు స్టేషన్ల రికార్డుల నిర్వహణ గురించి తెలియజేయనున్నారు. పోలీసుల దర్యాప్తుల్లో కీలక భూమిక పోషించే బి డి టీం, డాగ్స్ బందం విన్యాసాలు ప్రదర్శించనున్నారు. 27 వరకు జిల్లా వ్యాప్తంగా చర్చావేదికలు, వక్తృత్వపు పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 28 న వైద్య, రక్తదాన శిబిరాలను ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా వ్యాప్తంగాతమ పరిధుల్లో మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి సామాజిక సేవను చాటనున్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదిన సమైక్యతా పరుగును జిల్లా వ్యాప్తంగా (రన్ ఫర్ యూనిటీ) నిర్వహిస్తున్నామన్నారు.



ఎస్‌పి కృష్ణకాంత్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు మండలం పందలపాడు గ్రామంలో 20 కుటుంబాల వారు వైసిపిని వీడి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టిడిపిలో ఆదివారం చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఎంఎల్ఎ పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటూరి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ తగిన గుర్తింపు ఉంటుందని, పాత, కొత్త నాయకులు అందరూ కలిసి పార్టీ అభివద్ధికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నార్నే రోశయ్య, పార్టీ నాయకులు కూనం సుబ్బారెడ్డి, గోచిపాతల మోషే, రామాల కష్ణారెడ్డి కూనం రామకష్ణారెడ్డి, కంజుల వెంకటరామిరెడ్డి, కంజుల రామచంద్రారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు..

టైర్ల షాపు దగ్ధం

రూ. 20 లక్షల ఆస్తి నష్టం - బాధితుడు ఆవేదన

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణంలోని ఒవి రోడ్డు కందుకూరు పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురులో ఉన్న టైర్ల షాపు శనివారం రాత్రి దగ్ధమైనది. ప్రమాదానికి గురైన టైర్ల షాపులో దాదాపు రూ. 20 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు షాప్ యజమాని షేక్ రఫీ చెప్పాడు.ఈ మధ్యనే దాదాపు 5 లక్షల కొత్త స్టాకు తీసుకొచ్చి షాపులో వుంచాను.ప్రమాద సంఘటన వేకువ జామున నాలుగు గంటల సమయంలో పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ వస్తే తెలిసిందన్నారు. వెంటనే హుటా హుటిన వచ్చానని అప్పటికే షాపుపూర్తిగా దగ్ధమైనదని తెలిపారు.అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఎంతోకాలంగా వ్యాపారం నిర్వహించుకుంటున్న నాకుఇటువంటి సంఘటన ఎప్పడు జరగలేదని, కుటుంబానికి తీవ్ర ఆవేదన మిగిలిస్తుందని యజమాని తెలిపారు.పోలీస్ అధికారులు ప్రమాదమా లేక మరి ఏమన్నా కారణాల వలన తగలబడిందో దర్యాప్తు చేసి నాకు న్యాయం చేయవలసినదిగా కోరుచున్నాను అని అన్నారు. పట్టణంలో ఇటువంటి అగ్ని ప్రమాదాలు జరగటం ఈ మధ్యకాలంలో ఇది రెండవదని పోలీసు అధికారులు ప్రమాద కారణాలను గుర్తించి మరల జరగకుండా తగిన చర్యలు తీసుకునే విధంగా చేయగలరని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



దగ్ధమైన షాపు ఇదే..

ప్రత్యేక హోదా ఇవ్వాలి

ప్రజాశక్తి - తోటపల్లిగూడూరు

రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ఇవ్వాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ ప్ర జా ఆత్మ గౌరవ వేదిక జిల్లా అ ధ్యక్షులు కోసూరు నారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. ఆది వారం ఎపి ప్రజా ఆత్మ గౌరవ వేధిక జిల్లా సమావేశం జరి గింది. నారాయణ గౌడ్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక హెూదా ముగిసిన ఒక అ ధ్యాయమని అంటున్నాయని, కానీ ప్రత్యేక హోదా, విభ జన హామీల సాధనే తమ ధ్యేయమని తెలిపారు.అనంతరం నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రజా ఆత్మ గౌరవ వేధిక కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కోసూరు నారాయణ గౌడ్, ఉపాధ్యక్షులుగా అన్నం సురేష్, పినిశె ట్టి శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా మద్దిలేటి శరత్ బాబు,కా ర్యదర్శులుగా నలిశెట్టి పవన్ కుమార్, కనిశెట్టి శ్రీనివాసు లు, పోలూరు శ్రీనివాసులు, కార్యదర్శిగా గద్ది కిషోర్ ల ను ఎంపిక చేశారు. చెన్నూరు విజ య్, దమ్మాయి రవిచంద్ర, వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రతినిధి ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

ప్రజాశక్తి-కందుకూరు

33/11 కెవి కందుకూరు పట్టణం పామూరు రోడ్ సబ్‌స్టేషన్ నందుగల 11 కెవి ఇండస్ట్రియల్ ఫీడర్ నందు లైనుకు తగిలే కొమ్మలను తొలగించుటకు సోమవారం ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని విద్యుత్ ఎఇ నరసింహం తెలిపారు. ఆ యొక్క ఫీడర్ పరిధిలో ఉన్నటువంటి ప్రశాంతి నగర్ పామూరు రోడ్ లో ఉన్నటువంటి ఇండస్ట్రీస్ జియో టైల్స్, హెరిటేజ్ మిల్క్ లైన్, ఐటిఐ కాలేజ్ , ఎన్నారై మిల్క్ లైన్ వారు విద్యుత్ శాఖకు సహకరించాలని అయన కొరారు.

ఉపాధ్యాయ ఉద్యమంలో యుటిఎఫ్ కీలక భూమిక



సాంబయ్య సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - లింగసముద్రం

ఉపాధ్యాయుల హక్కులు,సమస్యల కోసం జరిగే పోరాటంలో యుటిఎఫ్ కీలక భూమిక పోషించిందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జివి చలపతి శర్మ అన్నారు. లింగసముద్రంలోని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయురాలు సరోజిని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న చలపతి శర్మ మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన యూనియన్ గా పేరు తెచ్చుకొని ఎన్నో పోరాటాలు చేసి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారమయ్యేలా చేసిందన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యూనియన్ సాధించిన ఎన్నో విజయాలను, పోరాటాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పలువురు సీనియర్ యుటిఎఫ్ కార్యకర్తలను రిటైర్డ్ ఉపాధ్యాయులను ఎసన్మానించారు.అదేవిధంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన లింగసముద్రం పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు కల్లూరి ప్రభాకర్ ను ఘనంగా సన్మానించడం జరిగింది. పెద్దపవని టిడిపి అధ్యక్షులు గొర్రెపాటి సాంబయ్య, భారతి కుమారుడు విష్ణు సాయినాథ్ జ్ఞాపకార్థం ఉపాధ్యాయులకు బ్యాగులను అందజేశారు.ఈ సందర్భంగా సాంబయ్యను ఘనంగా శాలువా కప్పి మెమొంటో అందజేసి సత్కరించారు.ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు,కే సూర్య ప్రకాష్ రావు శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు మల్లెబోయిన సుధాకర్,కూరపాటి రమేష్, టి సుధాకర్ రావు,ఎం కొండయ్య,కే ప్రభాకర్,కే మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

లింగసముద్రం మండల యుటిఎఫ్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు.గౌరవాధ్యక్షులు- వై రామ చంద్రయ్య అధ్యక్షులు -ఎస్ సూర్యనారాయణ,సహాధ్యక్షులు- ఆర్ వెంకటకష్ణ, సహాధ్యక్షులు - ఎస్ శాంత కుమారి,ప్రధాన కార్యదర్శి - టి సుధాకర్ రావు, కోశాధికారి - కే మహేంద్ర, కమిటీ సభ్యులుగా ఎం.లక్ష్మమ్మ,సి హెచ్.సతీష్, సి హెచ్. రాజేష్,ఏ. సాంబయ్య,ఎం.కొండయ్య,పి.భాస్కర్,ఎంఎల్ నరసింహారావు ఆడిటర్ గా కే.ప్రభాకర్ లను ఎన్నుకున్నారు.జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.సూర్యనారాయణ, టి.సుధాకర్, టి. సరోజినీ, ఎం.ఎం.సుధాకర్‌రావు, డి.మాధవరావులను ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీ చేత యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.చలపతి శర్మ, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు ప్రమాణం చేయించారు.



లింగసముద్రం మండల యుటిఎఫ్ మండల నూతన కమిటీ



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం..

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పందలపాడు పంచాయతీలో 10.06 లక్ష రూపాయలు నిధులతో, కోవూరు పంచాయతీలో 24.45 లక్షల రూపాయలతో నూతన సిసి రోడ్ల నిర్మాణాని పనులకి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా అభివద్ధిని విస్మరించిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన కోసం కషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివద్ధి పథంలో నడిపించగలరని నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి ప్రజలు అధికారం ఇచ్చారని దానికి అనుగుణంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని, రాష్ట్ర అభివద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.కందుకూరు మండలంలోని అన్ని గ్రామాలకు త్రాగు నీటికి ఇబ్బంది లేకుండా సాగర్ జలాలు ను త్వరలోనే అందజేస్తానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు లోకేష్ బాబు నియోజకవర్గ ప్రజల సహకారంతో కందుకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, పంచాయతీరాజ్ డిఇ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రతన్ జ్యోతి, ఎమ్మార్వో ఇక్బాల్, పార్టీ నాయకులు కూనం సుబ్బారెడ్డి, గోచిపాతల మోషే, రామాల కష్ణారెడ్డి, కూనం రామకష్ణారెడ్డి, కంజుల వెంకటరామిరెడ్డి కంజుల రామచంద్రారెడ్డి చుంచు హరిబాబు నాదెళ్ల వెంకటరమణయ్య, నాదెళ్ల మాధవరావు, రామారావు, రవికుమార్, బుస్సారెడ్డి కష్ణారెడ్డి కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

ప్రజాశక్తి-కందుకూరు : నిత్యం రద్దీగా ఉండే కందుకూరు పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో మురుగుకాలువ పై మూత లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. 24 గంటల పాటు పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో ప్రజలు వాహనాల తో రద్దీగా ఉంటుంది. ఇటీవల మురుగు కాలవలోని పూడికను తొలగించడానికి మూత తీశారు. తిరిగి మురుగు కలవపై మూత వేయలేదు దీంతో మురుగకాలపై వేయాల్సిన మూత వాహనాలు ఎక్కి పగిలిపోయింది. నిత్యం ప్రజలతోపాటు మున్సిపల్ అధికారులు కూడా దీనిని చూస్తూ ఉంటారు. ప్రజలు దానిలో పడి గాయాల పాలు అవుతున్న విషయం తెలిసినప్పటికీ తమకేమీ పట్టనట్లు ఉండిపోతున్నారు. మున్సిపల్ ఉద్యోగులు తమకేమీ పట్టదని వదిలివేశారు. వారు స్పందించకుంటే ప్రమాదాలకు జరిగే అవకాశముంది.



ప్రమాదంగా ఉన్న మ్యాన్ హోల్

మద్యం షాపు చిచ్చు..

ప్రజాశక్తి - తోటపల్లిగూడూరు


ఓ మద్యం షాపు ఏర్పాటు వివాదం తెలుగు తమ్ముళ్ళ మధ్య చిచ్చు రేపుతోంది. ఈ వివాదంలో టిడిపి రాష్ట్ర నాయకులు ఒకరు జోక్యం చేసుకుంటుడడం పట్ల తెలుగు తమ్ముళ్లు కస్సుబుస్సు మంటున్నారు. మండలానికి ఐదు లిక్క ర్ షాపులు మంజూరయ్యాయి. వీటిలో టిడిపి నేత ఉడత సుధాకర్ యాదవ్ కు వచ్చిన మద్యం దుకాణాన్ని నరుకూరు గ్రామానికి చెందిన తెలుగు తమ్ముళ్ళకు అప్పగించారు. ఈ మేరకు నరుకూరులో మద్యం షాపు ఏర్పాటు చేసేందుకు స్థానిక టిడిపి నాయకు లు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ నరుకూరులో షాపు ఏర్పాటు విషయంలో తెలుగు తమ్ముళ్ళకు మండలానికి చెందిన టిడిపి రాష్ట్ర నాయకులు ఒకరు అడ్డు తగులుతుండడం గమనార్హం.షాపు ఏర్పాటులో తమకు సహకరించాల్సిన ఈ నాయకుడు అందుకు భి న్నంగా అడ్డుకొంటుడడం పట్ల తెలుగు తమ్ముళ్లు అస హనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తమ గ్రామం (నరుకూరు)లో మద్యం షాపు పెట్టే విషయంలో ఈ నా యకుని అనవసర జోక్యం పట్ల తెలుగు తమ్ముళ్లు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. మధ్య మద్యంషాపు ఏ ర్పాటుపై నెలకొన్న విభేదాలు ఉద్రిక్తతకు దారిదారితీసే పరిస్థితులు కనిపిస్తు ఒడటంతో టీడీపీ కార్యక్తలు ఆందో ళన చెందుతు న్నారు. ఏదేమైనా మద్యం షాపు ఏ ర్పా టు అంశం తెలుగు తమ్ముళ్ళ మధ్య పెడుతున్న చిచ్చు మండలంలో చర్చనీయాంశమైంది.



రైతు బజార్ నిర్వహణ అస్తవ్యస్తం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు రైతు బజార్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. రైతు బజార్లో కూరగాయల ధరలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. బోర్డుపై ఉన్న ధరల కంటే ఎక్కువ ధరలకు అక్కడున్న వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నాం పట్టించుకునే నాథుడే లేరు. మరో విధంగా వ్యాపారులు కూడా నష్టపోతున్నారు. రైతు బజార్లో తెల్లవారుజాము నుంచి రాత్రి 9 గంటల వరకు వ్యాపారులు వ్యాపారాలు సాగిస్తారు. ఆ తర్వాత దుకాణాలు వదిలి ఇళ్ళకి వెళ్తారు. దుకాణాలను పరిరక్షించాల్సిన బాధ్యత రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ తో పాటు కందుకూరు మార్కెట్ యార్డ్ ఉద్యోగులపై ఉంటుంది. రైతు బజార్ నైట్ వాచ్మెన్ కూడా ఉన్నారు. అయితే రైతు బజార్లోకి ఆవులు ఇతర జంతువులు రాత్రి వేళల్లో వచ్చి కూరగాయలను తిని సర్వ నాశనం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు.గతంలో ఎవరూ లేని సమయంలో దుకాణాల్లో కూరగాయలు దొంగతనాలు కూడా జరిగాయి. అప్పట్లో విలేకరులు మార్కెట్ యార్డ్ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. రైతు బజారు నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని వారి సెల్ ఫోన్ల ద్వారా ఎవరు కూరగాయలు దొంగతనం చేస్తున్నారని పసి కట్టడం మొదలుపెట్టారు. దాంతో దొంగతనంగా కూరగాయలు తీసుకుపోవడం ఆగిపోయినప్పటికీ ఆవులు జంతువులు తినడం మాత్రం ఆగలేదు. రైతు బజార్ వాచ్‌మెన్లు దుకాణాల్లోని సరుకులను కాపాడడంలో విఫలమవుతున్నారు. ఈ విషయం రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కి ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం ఉండటం లేదు. నైట్ కాపులా వుండాల్సిన వాచ్మెన్ సమాధానం సక్రమంగా ఉండటం లేదని వ్యాపారులు చెబుతున్నారు. కూరగాయల ధరలు మండిపోతున్న ప్రస్తుత రోజుల్లో ఆవులు జంతువులు విపరీతంగా దుకాణాల మీద పడి తినడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. రైతు బజార్లో ఉన్న ధరల పట్టికలు కూడా సక్రమమైన రీతిలో కనిపించట్లేదు. రైతు బజార్ దుకాణాల్లో విద్యుత్ లైట్లు రాత్రి పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీనివల్ల కరెంటు బిల్లులు కూడా తడిసి మోపెడుడవుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రైతు బజార్లో పరిశుభ్రత లేకుండా పోయింది. పారిశుధ్యం పనులు అరాకొరగానే జరుగుతున్నాయి. ఉన్నతాధి కారులు రైతు బజార్ నిర్వహణను చక్కబెట్టకపోతే వినియోగదారులు ఇబ్బందులు పడే అవకాశముంది.



రైతు బజారులో కూరగాయలు తింటున్న ఆవు

పాలస్తీనాకు అండగా నిలుద్దాం..



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-వెంకటాచలం : ఇజ్రాయెల్ దాడిలో పాలస్తీనాలో ఎంతో ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లిందని, ఈ నేపథ్యంలో ఆ దేశ పౌరులకు అండగా నిలుద్దామని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. వెంకటాచలం, మనుబోలు మండల ప్రాంతీయ ఆర్గనైజింగ్ కమిటీ జనరల్ బాడీ సమావేశం ఆదివారం అనికే పల్లి గ్రామంలో ముంగర వెంకటాచలయ్య, బిని భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్ రావు పాల్గొని ప్రసంగించారు. సూపర్‌సిక్స్ పథకాల అమలు కోసం భవిష్యత్తులో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరు యాదగిరి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోగుల శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, సిపిఎం సీనియర్ నాయకులు కటికల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడుగురితో ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా తలారి దేవదానం, సభ్యులుగా జి.ఆదిలక్ష్మయ్య, బిని భాస్కర్, ముంగర వెంకటశేషయ్య, తుమ్మలూటి వెంకయ్య, పొట్టేపాలెం సుధాకర్, షేక్ సిరాజ్, కమిటీ ఆహ్వానితులుగా ఓడూరు వెంకటలక్ష్మయ్య, ముంగర చెంచురామయ్య, చెముడుగుంట ఆదిశేషయ్య లను ఏర్పాటు చేశారు.



కన్వీనర్‌గా ఎన్నికైన తలారి దేవదానం

సిపిఎం శాఖ మహాసభలు



ప్రజాశక్తి-నెల్లూరు : రూరల్ నియోజక వర్గం పరిధిలోని 29వ డివిజన్ గాంధీనగర్‌లోని సిపిఎం శాఖ కార్యదర్శిగా షేక్ జావిద్ ఎన్నికయ్యారు. ఆదివారం గాంధీనగర్‌లోని సిపిఎం కార్యాలయంలో హుస్సేన్ బాషా అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు పరిశీలకులుగా రూరల్ కార్యదర్శి బత్తుల కృష్ణయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు కొండా ప్రసాద్, కిన్నెర కుమారులు వ్యవహరించారు. ఈ సందర్భంగా గత మూడేళ్ల కాలంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాల వాటి వివరాలను కార్యదర్శి సభ్యులకు తెలియజేశారు. ఎన్నికైన కార్యదర్శి ఆధ్వర్యంలో రాబోయే కాలంలో పార్టీ అభివృద్ధి కోసం ఏ విధంగా పనిచేయాలని రూరల్ కార్యదర్శి బత్తుల కృష్ణయ్య సూచనలు తెలియజేశారు.



ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలం చేవూరు గ్రామ సిపిఎం శాఖ మహాసభ శనివారం నూతలపాటి వెంకటేశ్వర్లు ఈ మహాసభను సిపిఎం గుడ్లూరు మండల కన్వీనర్ ప్రారంభించారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాల ని సిపిఎం శాఖ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం సిపిఎం శాఖ నూతన కార్యదర్శిగా జరుపురి బ్రహ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ధన్యాసి పిచ్చయ్య, చేవూరు రాజగోపాల్, నూతలపాటి వెంకటేశ్వర్లు, ఈ బ్రహ్మయ్య పాల్గొన్నారు. అక్టోబర్ 30వ తేదీ గుడ్లూరులో జరిగే గుడ్లూరు ప్రాంతీయ మహాసభను జయప్రదం చేయాలని శాఖ తీర్మానించింది.

దుప్పట్లు, ఆహారం అందజేత

ప్రజాశక్తి-కావలి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇబ్బంది పడుతున్న కావలి పట్టణ 16వ వార్డు దివ్యాంగుల కాలనీలోని దివ్యాంగులకు, వారి కుటుంబ సభ్యులకు ఆదివారం హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు, చికెన్ బిర్యానీ పొట్లాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి రూరల్ ఎస్ఐ బాలకృష్ణ విచ్చేసి, వారి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. బాలకృష్ణ మాట్లాడుతూ హ్యాపీ సేవాసంస్థ ద్వారా ఘనిబాషా చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని, ఘనిబాషాతో పాటు వారి సభ్యులందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో దివ్యాంగులకు అండగా నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. హ్యాపీ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్.ఘనిబాషా, దాత షేక్.ఎస్దాని వారి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్. ఘనిబాషా, సంస్థ సలహాదారులు చేవూరు.ప్రభయ్య, సభ్యులు షేక్.చాన్‌బాషా, సయ్యద్. నౌషద్ అలీ, దాతలు షేక్.గౌస్ బాషా, షేక్.ఎస్దాని, రూరల్ హెడ్ కానిస్టేబుల్ షేక్.జిలానిబాషా, షేక్.ఇమ్రాన్, షేక్.షఫీర్, తదితరులు సేవలందించారు.

ఆహ్లాదకరంగా ఉదయగిరి దుర్గం



ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి దుర్గం సర్వాపేట నీటి ప్రవాహం ఎంతో ఆహ్లాదకరంగా ప్రకృతి అందాలతో ఆకర్షిస్తు ఊటీని తలపిస్తుందని ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేసేందుకు కృషి చేస్తామని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్‌పి మాజీ ఛైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని దుర్గంపల్లి గ్రామంలోని కోనకాలువ వల్లభరాయ ఉదయలక్ష్మి దేవాలయాలను సల్వాపేటను ఆయన పరిశీలించామని పర్యాటక కేంద్రంగా ఈ ప్రాంతానికి అన్ని హంగులు ఉన్నాయని ఈ విషయాన్ని స్థానిక ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌కు నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఈ ప్రాంతాన్ని టూరిజంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రకృతి అందాలు కమనీయంగా ఊటీని తలపిస్తున్నాయని ఈ ప్రాంతం టూరిజంగా అనువైందన్నారు. మండల కన్వీనర్ బయన్న, టిడిపి మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్.రియాజ్, ఎస్‌సిసెల్ మండల కన్వీనర్ నల్లిపోగు రాజా, మాజీ ఎంపిటిసి వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ మండల కన్వీనర్ బొజ్జ నరసింహులు, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు

ప్రజాశక్తి-కావలి : కావలి జె.బి. కళాశాలలో శనివారం ప్రారంభమైన విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఆటల పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. మహిళల విభాగంలో టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో కావలి జవహర్ భారతి విన్నర్స్‌గా కావలి విక్రమసింహపురి కళాశాల రన్నర్స్‌గా గెలిచారు. డబుల్స్‌లో జె.బి. కళాశాల విన్నర్స్ గానూ, నెల్లూరు డిఆర్‌డబ్ల్యు కళాశాల రన్నర్స్‌గా నిలిచారు. టెన్నిస్‌లో సింగిల్స్‌లో కావలి జె.బి. కళాశాల విన్నర్స్, శ్రీ సాయి డిగ్రీ కళాశాల రన్నర్స్ నిలిచారు. డబుల్స్‌లో నెల్లూరు డికెడబ్ల్యు కళాశాల విన్నర్స్, కావలి జె.బి. కళాశాల రన్నర్స్ గెలిచారు. బాడ్మింటన్‌లో సింగిల్స్‌లో నెల్లూరు జెనెక్స్ కళాశాల విన్నర్స్‌గా, కృష్ణ చైతన్యకళాశాల రన్నర్స్‌గా నిలిచారు. డబుల్స్‌లో జెనెక్స్ విన్నర్స్‌గా, డికెడబ్ల్యు కళాశాల రన్నర్స్ గానూ గెలిచారు. పురుషుల విభాగం బాడ్మింటన్ సింగిల్స్‌లో, డబుల్స్‌లో కూడా కావలి జె బి కళాశాల విన్నర్స్‌గా, నెల్లూరు కృష్ణచైతన్య కళాశాల రన్నర్స్‌గా గెలుపొందారు. టెన్నిస్‌లో సింగిల్స్‌లోను, డబుల్స్‌లోను కావలి జె బి కళాశాల విన్నర్స్‌గా, నెల్లూరు వి ఎస్ యు కళాశాల రన్నర్స్‌గా నిలిచారు. కబడ్డీలో సింగిల్స్‌లో నెల్లూరు ఎస్.ఆర్.జె. కళాశాల విన్నర్స్, కావలి శ్రీసాయి డిగ్రీ కళాశాల రన్నర్స్ గెలుపొందారు. విజేతలకు జెబి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.ప్రసాద్ రెడ్డి, జె.బి. ఫైనాన్స్ సెక్రటరీ ఆర్.మాల్యాద్రి, పలు కళాశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, దాదాపు 200మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే సిఎం లక్ష్యం

ప్రజాశక్తి-కొడవలూరు : సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాడని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలియజేశారు. ఆమె ఆదివారం కొడవలూరు మండలం మిక్కిలంపేట పంచాయతీలో పల్లె పండగ ప్రగతికి అండగా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తొలుత ఆమె రూ.5లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. తహశీల్దార్ స్ఫూర్తిరెడ్డి, ఎంపిడిఒ సుబ్బారావు, ఇఒపిఆర్‌డి సాయిప్రసాద్, పంచాయతీరాజ్ శాఖ డిఇ ప్రసాద్, ఎఇ శ్రీనివాసులు, మండల టిడిపి ఇన్‌ఛార్జి శ్రీహరి రెడ్డి, నాయకులు అమరేందర్ రెడ్డి, బుజ్జిరెడ్డి సుధాకర్ రెడ్డి, మదన్మోహన్ గరికిపాటి రాజేంద్ర, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

రంగయ్యకు రామిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-కావలి : 11వ వార్డుకు చెందిన వైసిపి నాయకులు రంగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరులోని నారాయణ హాస్పిటల్‌లో చికిత్స పొంది కావలి పట్టణంలోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైసిపి పట్టణ నాయకులు కుందుర్తి శ్రీనివాసులు, కామయ్య, మైనంపాటి జగదీశ్, కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, సన్నిబోయిన ప్రసాద్, పరుసు మాల్యాద్రి, అక్కిలిగుంట మాల్యాద్రి పాల్గొన్నారు.

నేటి నుంచి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు బస్సు సోమవారం నుంచి బుచ్చిరెడ్డిపాలెం అందుబాటులో ఉంటుందని స్థానిక టిడిపి నాయకులు తెలిపారు. కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియోజకవర్గంలో క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపట్టినట్లు, అందులో భాగంగా ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామని తెలిపారు.

దృఢ సంకల్పంతో 'సూపర్‌సిక్స్' అమలు



మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేసేందుకు తమ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో చేజర్ల, సంగం మండలాల పార్టీ ముఖ్య నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించిన మంత్రి, ఆత్మకూరు నియోజ వర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సభ్యత్వ నమోదుపై నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో తమ పార్టీ విజయానికి కారణమైన సూపర్‌సిక్స్ హామీల అమలుకు తమ ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని, దీపావళి నుంచి ఆడపడుచులకు మహాశక్తి స్కీమ్ ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పంపిణీకి శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజాశ్రేయం కట్టుబడిన ఒక్కొక్క హామీని నెరవేరుస్తూ సూపర్‌సిక్స్‌ను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాల మేరకు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్క కార్యకర్త సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఐదు నియోజకవర్గాలను సభ్యత్వ నమోదుకు ముఖ్యమంత్రి ఎంపిక చేసి అబ్జర్వర్లను నియమించారని, అందులో మన ఆత్మకూరు నియోజకవర్గం ఎంపికవడం మనందరికీ గర్వకారణంగా మంత్రి తెలిపారు. ప్రతిఒక్క కార్యకర్త కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల సభ్యత్వానికి రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు కూడా రూ.5లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పార్టీలో ఏ చిన్న పదవి పొందాలన్నా సభ్యత్వం తప్పని సరిగా ఉండాలన్నారు. ప్రతి సోమవారం మండల కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొంటున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రాబోయే ఐదేళ్లలో పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టు ఏర్పాటు, వివిధ రెసిడెన్షియల్ కళాశాల ఏర్పాటు, స్కిల్ కళాశాల ఏర్పాటు, నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గొప్ప సంకల్పంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఆలయాల మరమ్మతులకు రూ.5లక్షల వరకు నిధులు మంజూరు చేస్తామని, నాయకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలానికి ఒకటిన్నర కోటి రూపాయలు సిసి రోడ్లకు ఉపాధి హామీ పనులు మంజూరయ్యాయని తెలిపారు. మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు కూడా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ షాప్ దుకాణాల్లో కూడా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి మండలానికి 50 గోడౌన్లను మంజూరు చేశామన్నారు. ఆత్మకూరులో ఎన్‌టిఆర్ భవన్ పేరుతో టిడిపి కార్యాలయం శాశ్వత భవనం నిర్మిస్తామన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అనేక సంక్షేమ నిర్ణయాలతో పారదర్శకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. ఉచిత ఇసుక విధానాన్ని సులభ తరంగా అమలు చేస్తున్నామని, ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు ఉన్న వారు వ్యక్తిగత అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చన్నారు. ఏ అధికారి కూడా అడ్డుకోరు.. ఎవరైనా అడ్డుకుంటే వారిని సస్పెండ్ చేస్తామని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో కూడా కార్యకర్తలు అందరూ భాగస్వామ్యం కావాలని మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం సభ్యత్వ నమోదు ప్రక్రియపై పార్టీ పరిశీలకులు కార్తీక్, పార్టీ నాయకులకు వివరించారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాస్, నాయకులు బొల్లినేని గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో జీవనం దుర్భరం

- పట్టించుకోని అధికారులు : సిపిఎం

ప్రజాశక్తి-కావలి



టిడ్కోగృహాల వద్ద పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

కావలి పట్టణం మద్దూరుపాడు టిడ్కో గృహాల్లో ప్రజలు దుర్భర జీవనం గడుపుతున్నారని, అధికారులు స్పందించి, వారికి తగిన సౌకర్యాలు కల్పించి, ఆదుకోవాలని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు టిడ్కో గృహాలను సందర్శించారు. పట్టణంలో మద్దూరుపాడు వద్ద టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న ప్రజలను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి ప్రజలు సిపిఎం నాయకులకు తెలుపుతూ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమై ఇళ్లలో నుంచి బయటికి వస్తే మోకాలి పైకి నీళ్లలో వారం రోజుల నుండి ఇలాగే ఇబ్బందుల పడుతున్నామని ఇళ్లచుట్టూ ఎటు చూసినా నీళ్లేనని కొన్ని ఇళ్లు ఉరుస్తున్నందున మధ్యలో డబ్బాలు పెట్టుకొని ఉన్నామని ఇళ్లలో నీళ్లు బయటికి వస్తే నీళ్లు ఉన్నందున చాలా ఇబ్బందులకు గురి అవుతున్నామని తెలిపారు. అంతేకాకుండా పాములు ఇళ్లల్లోకి వస్తున్నాయని కరెంటు సక్రమంగా ఉండలేదని, కొన్ని ఇళ్లకు మీటర్ల బోర్డులోకి నీళ్లు వచ్చినందున రెండు రోజులుగా కరెంటు కూడా లేదని తెలిపారు. ఇళ్ల చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి ఉన్నందున విషపురుగుల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. చీకటి పడితే పిల్లలు పెద్దలు భయాందోళనతో జీవిస్తున్నామని తెలిపారు. అధికారులు వచ్చి చూసి వెళ్లారు కానీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అనేక సమస్యలతో సతమతమవుతూ ఇక్కడ నివాసాలు ఉంటున్నామని వారి ఆవేదనను సిపిఎం నాయకులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ అప్పటి టిడిపి ప్రభుత్వంలో సుమారు 8యేళ్ల క్రితం పట్టణంలో నివాసం ఉంటున్న ఇల్లులేని పేదలకు సుమారు 2200 ఇల్లు నిర్మించారని 500, 50వేలు, లక్ష రూపాయలు ఇళ్ల రాణం జరిగిందన్నారు. కొంతమంది ఇళ్లలో నివాసాలు ఉంటున్నారని వీరికి ఇప్పటికీ ఎలాంటి వసతులు లేవన్నారు. వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని వర్షాలకు వీధులన్నీ నీళ్లతో నిండి, ప్రజలు తిరగలేని పరిస్థితులలో వారం రోజుల నుంచి ఇబ్బందుల పడుతున్నారన్నారు. కొన్ని ఇళ్లు ఉరవడంతో ఇంట్లో నీళ్లు బయట నీళ్లతో ఉండలేని పరిస్థితులలో పేదలు ఉన్నారన్నారు. డబ్బులు చెల్లించి, ఇళ్లలోకి వచ్చిన పేదలు ఇంటి కల నీళ్ల పాలైపోయిందన్నారు. కొత్త ఇల్లు ఉరవడం ఆశ్చర్యకరమైన విషయమన్నారు. ఇది అప్పటి ప్రభుత్వ వైఫల్యం అని, ఈ ఇళ్ల చుట్టూ ప్రహరీ గోడలు కూడా లేదని, పాముల బెడదతో ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఈ సమస్యలను ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం కల్పించుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. లేదంటే ప్రజలను సమీకరించి, ఆందోళన చేపడుతామని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.మధు సూదన్ రావు, బి.కృష్ణయ్య, పి.తిరుపాలు, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విఓఎల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-బిట్రగుంట



మాట్లాడుతున్న మద్దిబోయిన వీరరఘు

బోగోలు మండలంలో అనేక సంవత్సరాలుగా విఓఎలుగా పని చేస్తున్న వారిని రాజకీయ ఒత్తిళ్లకు తలవొగ్గి తొలగించడం అన్యాయమని మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైసిపి కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోగోలు మండలంలో ఎన్నో సంవత్సరాలుగా గ్రామ తీర్మానం మేరకు విఓఎలుగా ఎన్నిక కాబడి పనిచేస్తున్న నిరుపేద మహిళలను నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి మీద ఒత్తిడి చేసి వారిని రాజీనామా చేయమనడం భవ్యం కాదని తెలిపారు. గతంలో ఎన్ఆర్ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిపై కూడా అదేవిధంగా రాజకీయ దురుద్దేశంతో తొలగించినట్లు తెలిపారు. ఇప్పుడు మళ్లీ విఓఎలపై అధికారులు ఒత్తిడి చేపించి రాజీనామా చేయించాలని చూడటం భావ్యం కాదని తెలిపారు. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా విఓఎల పైన ఒత్తిడి తీసుకొస్తే వారిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. టిడిపి ప్రభుత్వం ఎన్నికలలో యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చి ఉద్యోగం చేస్తున్న వారిని తొలగిస్తే వారిపై ఆధారపడి బతుకుతున్న కుటుంబం రోడ్డున పడుతుందని తెలిపారు. ఉచితంగా ఇసుకను పంపిణీ చేస్తామని మాట చెప్పి ఇంతవరకు ఇసుక సరఫరా చేయకపోవడం దారుణమని, ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు పనులు లేక వారి కుటుంబాలు పస్తులు పడుకునే పరిస్థితికి ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు.

391.8 వర్షపాతం నమోదు

ప్రజాశక్తి-కావలి

కావలి డివిజన్‌లో ఆదివారం మండలాల్లో వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. డివిజన్‌లో మొత్తం వర్షపాతం 391.8 కాగా, జలదంకి మండలంలో 27.2మిల్లీమీటర్లు, కావలి 21.6, బోగోలు 17.2, కలిగిరి 73.4, వింజమూరు 53.4, దుత్తలూరు 68.4, దగదర్తి 74.2గా వర్షపాతం నమోదైంది. అల్లూరులో 30.8, విడవలూరు 12.0, కొడవలూరు 13.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఆర్.డి.ఒ. కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చెర్లో సుబ్బరామిరెడ్డి మృతి తీరనిలోటు

- నివాళులర్పించిన మాజీ సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, పలువురు నేతలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



మాట్లాడుతున్న చంద్ర రాజగోపాల్

శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పనిచేసేది కమ్యూనిస్టు పార్టీయేనని, చెర్లో సుబ్బరామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని చెర్లో సుబ్బరామిరెడ్డి నివాసం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంతాప సభలో ముందుగా సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి డాక్టర్ ఎం వి రమణారెడ్డి, రైతు సంఘం నాయకులు మూలివెంగయ్య చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ 86 సంవత్సరాలు సంపూర్ణ జీవితాన్ని గడిపారని, సిపిఎం అభివద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని, నిత్యం కమ్యూనిస్టు పార్టీ భావజాలాలతో మాట్లాడి పార్టీ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. నెల్లూరులోని రామచంద్రా రెడ్డి ప్రజా వైద్యశాల అభివృద్ధికి డాక్టర్ చెర్లో రమణారెడ్డి పాత్ర చాలా గొప్పదని కొనియాడారు. రామచంద్రారెడ్డి హాస్పిటల్ అభివృద్ధికి చెర్లో వారి సహకారం ఎంతో తోడ్పాటునందించిందని తెలిపారు. రామచంద్రా రెడ్డి హాస్పిటల్‌లో పేదవారికి వైద్యం అందిస్తూ డాక్టర్ రమణారెడ్డి, తమ్ముడు సుబ్బరామిరెడ్డి ఆత్మకూరులో సిపిఎం ఎదుగుదలకు ప్రచారం చేస్తూ ఉండేవారన్నారు. సుబ్బరామిరెడ్డి, రామకృష్ణారెడ్డిలు సుబ్బరామిరెడ్డి ఇంటి ఎదురుగా మొట్టమొదటి సారిగా సిపిఎంను ఆత్మకూరులో వారి స్వయం కృషితో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం కొద్దిరోజుల తర్వాత క్రిస్టియన్ పేటలోని సిపిఎం పార్టీని అక్కడికి మార్చారన్నారు. అక్కడ పార్టీ కార్యాలయానికి కూడా ఆయన తోడ్పాటు అందించారన్నారు. ఆయన వ్యక్తిత్వం చాలా మంచిదని నీతి నిజాయితీగా పార్టీకి కట్టుబడి పని చేస్తున్న ఉన్నారన్నారు. అనంతరం టిడిపి నాయకులు ఐ.వి. రమణారెడ్డి, ఆయనతో ఉన్న సంబంధాన్ని వివరించారు. రైతుసంఘం నాయకులు పులిగుండ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ సుబ్బరామిరెడ్డి నీటిసంఘం అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో పంట కాలువలు మరమ్మతులు చేయించి రైతులకు ఎంతో మేలు చేసినట్లు వివరించారు. గంటా లక్ష్మీపతి మాట్లాడుతూ సుబ్బరామిరెడ్డి పార్టీ అభివృద్ధికి ఎంతో తోడ్పాటు నందించారని, పలువురికి ఆయన ఆర్థికం గానూ తోడ్పాటు అందించారని, పార్టీకి నిరంతరం శ్రమిస్తూ రైతాంగానికి ఆత్మకూరు చెరువుకు సోమశిల జలాలను వచ్చేందుకు కృషి చేశారన్నారు. నిరంతరం పని చేస్తూ ఒక రైతుగా, ఒక కామ్రేడ్‌గా ఆయన మృతి చెందారని తెలిపారు. సిఐటియు జిల్లా నాయ కులు జివి శివప్రసాద్, ప్రముఖ న్యాయవాది కె.వి.శేషారెడ్డి, డాక్టర్ ఐవి రమణారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, బిజెపి నాయకులు కుడుమల సుధాకర్ రెడ్డి మాట్లాడారు. డాక్టర్ సుధాకర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది జక్కా శేషమ్మ, ఆత్మకూరు నాగయ్య, లక్కు కృష్ణప్రసాద్, నాయకులున్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు సముద్రతీరంలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. ఇందుకూరుపేట ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు కిసాన్‌నగర్‌కు చెందిన అన్నం ప్రమీల (34) యువతి భర్త అన్నం మణికంఠతో గొడవపడి శుక్రవారం ఇంటి నుండి బయటకు వచ్చిందని, అప్పటి నుండి కుటుంబ సభ్యులు కూడా ప్రమీల కోసం వెతుకుతున్నారనీ తెలిపారు. ఆదివారం మైపాడులో మృతదేహం లభ్యమైందని తెలిపారు. మృతురాలు ఓ ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తుందని తెలిపారు. కుటుంబ కలహాలే మహిళ ఆత్మహత్యకు కారణమని ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఓ కంకర క్రష్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న యువకుడు విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల మేరకు.. వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేల్ మండలం చెన్నంపల్లి గ్రామాంకు చెందిన పి.సురేష్ (26) దుత్తూరు మండలంలోని బండకిందిపల్లి గ్రామంలో క్రంకర్ క్రష్ చెందిన టిప్పర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారని ఈ క్రమంలో తెల్లవారుజామున టిప్పర్‌లోని టైర్లు అన్‌లోడ్ చేసే క్రమంలో లిఫ్ట్‌ఎత్తే సమయంలో కరెంటు తీగలకు తాగడంతో మృతుడు సురేష్ సంఘటనా స్థలంలో కుప్పకూలి పోవడంతో స్పందించిన తోటి సహజరులు హుటాహుటిన వింజమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారని శవ పరీక్ష కోసం పోలీసులు కేసు నమోదు చేసి ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-కావలి : తపాలా శాఖ ఆధ్వర్యంలో దీన్ దయాళ్ స్పర్శ్ యోజన క్విజ్ ఎగ్జామ్ – 2024 ఫస్ట్ లెవెల్ కావలి పట్టణంలో ఆదివారం జరిగింది. ఈ పరీక్షకు 138మంది విద్యార్థులు హాజరయ్యారు. స్థానిక వైద్యులు డాక్టర్ శ్రీధర్, పోస్టల్ ఎ.ఎస్.పి. ఆర్.మల్లేశ్వరరావు, హెడ్ పోస్ట్‌మాస్టర్ ఎ.వి. కృష్ణయ్య, డిప్యూటీ పోస్టుమాస్టర్ ఎం.జి. కె.సాయి పి ఆర్ ఐ (పి) వై.భాస్కర్, సీనియర్ సిబ్బంది, మురళి, రవి, ఇతర తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

'పల్లా'ను కలిసిన 'మాలేపాటి'



ప్రజాశక్తి-కావలి : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసులును ఆదివారం సాయంత్రం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కావలి నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి సంక్షిప్తంగా ఆయనకు వివరించారు. వీరి సమావేశంలో రాష్ట్ర మైన్స్, జియాలజీ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఉన్నారు.

ఘనంగా తొలి వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజవర్గ ప్రథమ వార్షికోత్సవ త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు అధ్యక్షతన ఆత్మకూరు నియోజవర్గం నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పసుపులేటి రమేష్ మోహన్ బాబు రిటైర్డ్ ఎంపిడిఒ వారి సందేశం కులస్తులం ఐక్యమత్యంగా ఉండాలన్నారు. సోమ వెంకటసుబ్బయ్య సీనియర్ జర్నలిస్ట్ వారు మాట్లాడుతూ గత 40యేళ్ల నుంచి అనేక సంఘాల్లో నిర్ణయాతుకంగా పనిచేశానని తెలిపారు. ఎపి కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వేదిక ఒక ఆశయం చాలా గొప్పదని ఇది మన బలిజ సంఘీలకు మంచి శుభదినం అని తెలిపారు. ఎపికెఎటిడబ్ల్యుఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు నూతన కమిటీకి కర్త్వ ఆశయాలను లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో దోర్నాల రామ్మోహన్ జిల్లా ప్రతినిధి మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా అనేక సంఘాల్లో ఉన్నప్పటికీ అందరి అజెండా ఐక్యమత్యం మన వెల్ఫేర్ గురించి ఈ వేదిక ఏర్పాటు చేశారని ఫౌండర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంచల వెంకటేశ్వర్లు, వి.విష్ణుమోహన్, వెలిశెట్టి నారాయణరావు, పాల్గొన్నారు.



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

నూతన కమిటీ ఎన్నిక : ఆత్మకూరు నియోజకవర్గం నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడు తోట చిన్న వెంకటసుబ్బయ్య, అధ్యక్షుడు కొలగాని పెంచలయ్య, సహ అధ్యక్షుడు నలిశెట్టి శ్రీనివాసులు, ప్ర కార్యదర్శి కొండమూరి శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శి ఉసా చలపతి, సహ కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా కార్యదర్శి ముద్దం అంజనీ దేవి, జిల్లా ప్రతినిధులుగా పార్లపల్లి నాగేశ్వరీ, తంబా అంకయ్య, పాపిశెట్టి నరసింహులు ఈ సభ్యులందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కళ్యాణ మండపం ఫ్రీగా ఏర్పాటు చేసిన నలసిటి శ్రీనివాసులుకు మెమొండ్స్ అందించిన తోట శ్రీనివాసులు ఎంఇఒ, పార్లపల్లి సుధాకర్‌కి, నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

కుర్చీలు వితరణ

ప్రజాశక్తి-ఉదయగిరి : సిపిఎం కార్యాలయానికి పుల్లాయ పల్లి మాజీ సర్పంచ్ కంబాల నర సింహారెడ్డి 10 కుర్చీలను ఆదివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రజల పక్షాన నిలబడే పార్టీ సిపిఎం అని అలాంటి పార్టీకి కుర్చీలు వితరణ చేయడం సంతోషదాయకమన్నారు. ప్రజల పక్షాన కాకుండా కార్మికులు, కర్షకులు వెంట నిలిచి వారి సమస్యలపై పోరాటాలు చేసే పార్టీ సిపిఎం అని కొనియాడారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య, సిపిఎం నాయకులు నాయబ్, మస్తాన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు

జిఒ117ను రద్దు చేయాలి


ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

జిఒ నెంబర్ 117ను రద్దు చేయాలని ఎపి ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమవరపు భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో పట్టణంలోని పేరారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో నెల్లూరు డివిజన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవరపు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మాట్లాడారు. ముఖ్యంగా 117జిఒ రద్దు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల నిర్వహణలో గ్రాంట్ల విషయంలో ఎదుర్కొన్న ఇబ్బందులు పదో తరగతి పరీక్షల విషయంలో తెలుగు మీడియంలో పరీక్ష నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రులు లేవనెత్తుతున్న విషయాలు, అపార్ ఐడి క్రియేషన్‌లో ఎదుర్కొంటున్న ఆన్‌గోయింగ్ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి గౌరవాధ్యక్షులు ఎంవి చలపతి, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శి చలపతి, డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి బుజ్జయ్య, ఓ.వెంకటేశ్వరరావు, సాయి ప్రసాద్, దాదాపు 50మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శవ దహనశాల నిర్మాణం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని కోమరిక గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు ఇందుపూరు పవన్‌కుమార్ ఆదర్శంగా నిలుస్తున్నాడు. అమెరికా దేశంలో స్థిరపడినా కానీ పుట్టి పెరిగిన ప్రాంతం అభివృద్ధికి పవన్‌కుమార్ రెడ్డి తనవంతు సేవలు అందించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి దహన సంస్కారాల చేయడానికి కొమరిక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ.6లక్షల ఖర్చుపెట్టి శవదహనశాల భవనాన్ని నిర్మించి కొమరిక గ్రామ ప్రజలకు బహుమతిగా అందించారు. ఎన్నో సంవత్సరాల నుంచి వర్షాకాలంలో దహన సంస్కారాలు నిర్వహించేందుకు వీలు లేకపోవడంతో నెల్లూరుకు అధిక మొత్తంలో డబ్బు వెచ్చించి దహనం చేయడం జరుగుతుందని పవన్‌కుమార్ రెడ్డి సాయంతో దహన సంస్కారాలు తమ గ్రామంలోని చేసుకునేందుకు వీలుగా దహనశాల నిర్మించడం సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలియజేశారు. పుట్టిన గ్రామాన్ని మర్చిపోకుండా తమ గ్రామానికి సాయం చేసిన పవన్‌కుమార్ రెడ్డిని గ్రామస్తుల అభినందిస్తున్నారు.




దాత నిర్మించిన శవ దహనశాల

ఎన్నారై ఇందూపూరు పవన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ



గత సంవత్సరంలో తమ నానమ్మ అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, వర్షాకాలం కావడంతో దహన సంస్కారాలకు నెల్లూరులో చేయాల్సి వచ్చింద న్నారు. తమలాగా తమ గ్రామ ప్రజలు ఇంకెవరో ఇబ్బంది పడకూడదనే సంకల్పంతో రూ.6లక్షలతో దహనశాలను నిర్మించడం తెలిపారు. ధనసాయం తాను చేసిన అన్ని పనులు వైసిపి నాయకులు గూడూరు ప్రభాకర్ రెడ్డి, గూడూరు శివకుమార్ రెడ్డి దగ్గరుండి పనులు పూర్తి చేశారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కోమరిక గ్రామ సీనియర్ నాయకులు గూడూరు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ



ఇలాంటి యువకులు ప్రతి గ్రామంలో ముందుండి గ్రామంలో అవసరమైన సమస్యలను తీర్చాలని కోరారు. పరాయి దేశాలకు వలసలువెళ్లి పుట్టిన గ్రామాన్ని మరిచిపోతున్నా ఈ రోజుల్లో సొంత గ్రామంపై మక్కువతో పవన్‌కుమార్ రెడ్డి చేసిన సేవలు అభినందనీయమని తెలిపారు. తరతరాలు ఆయనపేరు నిలిచిపోతిందని కొనియాడారు.